క్లుప్తంగా

6న కేయూలో జయశంకర్ స్మారకోపన్యాసం

కేయూ క్యాంపస్: తెలంగాణ సిద్ధాంతకర్త డాక్టర్ జయశంకర్ 12వ స్మారకోపన్యాసాన్ని కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో ఈనెల 6న ఉదయం నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన సీనియర్ ఇంటర్నేషనల్ జర్నలిస్టు వెంకటనారాయణ పాల్గొని ఫెడరలిజం ఇన్ ఇండియా అనే అంశంపై స్మారకోపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని మల్లారెడ్డి కోరారు.

వీధికుక్కల పట్టివేత



ఖిలా వరంగల్: వరంగల్ 43వ డివిజన్ గణేష్‌నగర్‌లోని వీధికుక్కలను శనివారం పట్టుకుని సంరక్షణ కేంద్రానికి తరలించారు. వామ్మో వీధికుక్కలు అనే శీర్షికన సాక్షి దినపత్రిలో శనివారం ప్రచురితమైన కథనానికి బల్దియా అధికారులు స్పందించారు. ఉదయాన్నే బల్దియా అధికారుల పర్యవేక్షణలో వీధికుక్కలను సిబ్బంది బంధించారు.

సాక్షి స్పందన

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం



కాజీపేట రూరల్: కాజీపేట వెంకటాద్రినగర్‌లోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి ప్రాంగణంలో జన శిక్షణ సంస్థాన్ – వరంగల్ ఆధ్వర్యంలో ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి రెవరెండ్ డాక్టర్ కె.పీటర్ మాట్లాడుతూ 105 రోజుల పాటు 18 నుంచి 40 ఏళ్ల వయస్సు గల మహిళలకు మెటీరియల్ పంపిణీతో పాటు ఉచిత టైలరింగ్ నేర్పించనున్నట్లు ఆయన వివరించారు. జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఖాజా మొహినొద్దీన్ మాట్లాడుతూ అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు తిరుపతి, రాజు, సుజిత్, యోగేందర్, రిసోర్స్ పర్సన్ నఫీసున్నీసా బేగం, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రైవేట్ టీచర్లపై సీఎం అనుచిత వ్యాఖ్యలు’

విద్యారణ్యపురి: హైదరాబాద్‌లో ఎల్‌బీ స్టేడియంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రైవేట్ టీచర్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయినవాళ్లు అంటూ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు.

‘ప్రోగ్రెస్’లో బ్లూ డే వేడుకలు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ మాదిరెడ్డి కుంటలోని ప్రోగ్రెస్ హైస్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులు నీలిరంగు దుస్తులలో పాఠశాలకు హాజరయ్యారు. బ్లూ డే సందర్భంగా నర్సరీ, యూకేజీ చిన్నారులు నీలిరంగు డ్రెస్సులతో పాటు బ్లూ కలర్ బెలూన్, బ్లూ కలర్ ఆట వస్తువులతో సందడి చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మల్లాడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల్లో స్కూల్ పట్ల ఆసక్తి, వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకే బ్లూడే వేడుకలు నిర్వహించినట్లు వివరించారు. వేడుకల్లో స్కూల్ డైరెక్టర్ ఆశిష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ముదిరి నాగరాజు, ప్రైమరీ ఇన్‌చార్జ్ ప్రశాంతి, ఉపాధ్యాయురాలు వాణి, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ‘క్లీన్ అండ్ గ్రీన్’



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పలు విభాగాల్లో ఉద్యోగులు శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి పర్యవేక్షణలో ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగించాలి



కాశిబుగ్గ: మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీవిద్య



కాజీపేట: వారోత్సవాల్లో కార్పొరేటర్ విజయశ్రీ



ఖిలా వరంగల్: శాంతినగర్‌లో..

కాశిబుగ్గ: పుట్టిన బిడ్డకు వెంటనే తప్పనిసరిగా తల్లిపాలను తాగించాలని నగర డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, సీడీపీఓ శ్రీవిద్య సూచించారు. 36వ డివిజన్ చింతల్ -1 అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి ముర్రుపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని చెప్పారు. అనంతరం ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో శివనగర్ సర్కిల్ సూపర్‌వైజర్ ఆశ, అంగన్‌వాడీ టీచర్లు సునీత, రాధిక, అనిత, కోమల, అంజనమ్మ, పద్మ, ఏఎస్‌ఎం పెనినా, ఆర్పీ శ్రీలత, ఆయాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

63వ డివిజన్‌లో..

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురిలో తల్లిపాల వారోత్సవాల అవగాహన సదస్సును కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ శనివారం ప్రారంభించారు. అంగన్‌వాడీ టీచర్ టి.శ్రీదేవి ఆధ్వర్యంలో



కాజీపేట రూరల్: తల్లిపాల వారోత్సవంలో పాల్గొన్న వైద్యులు సంధ్యారాణి, నిరంజన్‌రావు

బాలింతలు, గర్భిణులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. లాభోక్తాలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి వాసుదేవరావుతో పాటు ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

33, 40వ డివిజన్లలో..

ఖిలా వరంగల్: వరంగల్ 40, 33వ డివిజన్లలో సూపర్‌వైజర్లు మాధవి, ఎం.రమాదేవి ఆధ్వర్యంలో వేర్వేరుగా తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా స్థానిక కార్పొరేటర్లు ముస్కమల్ల అరుణ, మరుపల్లి రవి హాజరై తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు శారద, జ్యోతి, వనజ, రేణుక, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే ఆస్పత్రిలో..

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండలోని లక్ష్మీ నరసింహ ఆస్పత్రి వైద్యురాలు సంధ్యారాణి పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లి పాలు నవజాత శిశువుకు మొదటి టీకా అని, శిశువుకు మొదటి ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలే సంపూర్ణ ఆరోగ్యమని ఆమె వివరించారు. కాజీపేట రైల్వే ఆస్పత్రి సీనియర్ ఎంఎస్ డాక్టర్ ఐ.నిరంజన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైల్వే ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అవయవ దానం గొప్పది



హన్మకొండ: ప్లకార్డులను ప్రదర్శిస్తున్న అసోసియేషన్ నాయకులు



విద్యారణ్యపురి: అవయవ దానానికి ముందుకొచ్చిన విద్యార్థులు

హన్మకొండ: శరీర దానం గొప్పదని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఇండియన్ ఆర్గాన్ డొనేషన్ డేను పురస్కరించుకొని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు మల్లారెడ్డి నేతృత్వంలో హనుమకొండ కలెక్టరేట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో శరీరదానం పోస్టర్లను ఆవిష్కరించారు. అంతకు ముందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటిసారి మరణానంతరం తన శరీరాన్ని దానం చేసిన ప్రజాకవి కాళోజీ విగ్రహం ఎదుట అసోసియేషన్ బాధ్యులు ప్లకార్డులను ప్రదర్శించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, ఉపేందర్ రెడ్డి, నిమ్మల శ్రీనివాస్, పద్మ, కేదారి, కృష్ణమూర్తి, సంపత్, శ్రీలత, నరసింహ రాములు పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకు రావాలి

విద్యారణ్యపురి: మరణానంతరం ప్రతిఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ కోరారు. రిటైర్డ్ లెక్చరర్ జంగా గోపాల్ రెడ్డి అధ్యక్షతన హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో శనివారం అవయవ దానంపై నిర్వహించిన సదస్సులో పరశురాములు, అభ్యుదయ సేవాసమితి అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, అధ్యాపకులు సూర్యనారాయణ, వెంకట్రామయ్య, విజయలక్ష్మి, రవీందర్ పాల్గొన్నారు. కాగా, అవయవ దానానికి 12మంది బీఈడీ విద్యార్థులు ముందుకు వచ్చారు.

కేరళ వరద బాధితులను ఆదుకుందాం

హన్మకొండ చౌరస్తా: భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన కేరళ బాధితులకు మానవతా దృక్పథంతో ప్రజలు ఆదుకోవాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. ఈమేరకు హనుమకొండ చౌరస్తా నుంచి అశోక కాంప్లెక్స్ వరకు డప్పుచప్పుళ్లతో ర్యాలీగా వెళ్లి దుకాణదారుల నుంచి విరాళాలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా కేరళలో ప్రకృతి బీభత్సం సృష్టించడంతో వందలాది మంది మృతి చెందారని, వేలాది మంది నిరాశ్రయులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ స్పందించి వారిని ఆదుకోవాలని సూచించారు. కేంద్రం



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కరుణాకర్, ఎల్లేష్, శ్రీనివాస్, సారంగపాణి, రవి, రమేష్, దేవా, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా గంజాయిని నిర్మూలిద్దాం

ఖిలా వరంగల్: తామంతా కలిసికట్టుగా గంజాయిని నిర్మూలించి యువత ప్రాణాలను కాపాడుదామని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనపై ఏసీపీ నందిరామ్‌నాయక్ ఆదేశాల ప్రకారం వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై మిల్స్‌కాలనీ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌స్పెక్టర్ మల్లయ్య మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను విచ్ఛిన్నం చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి



మాట్లాడున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

సారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనాన్ని విజయవంతం చేయాలి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణ



కాజీపేట: మాట్లాడుతున్న కార్పొరేటర్ రవీందర్

హసన్‌పర్తి: ఈనెల 5నుంచి 9వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన స్వచ్ఛదనం – పరిశుభ్రత కార్యక్రమాన్ని కార్పొరేటర్ అరుణకుమారి పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం – పచ్చదనంపై బాలాజీ గార్డెన్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బాషానాయక్, మాజీ సర్పంచ్ దేవరకొండ అనిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనం ఉండేలా ఈనెల 5వ తేదీ నుంచి జరగనున్న కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ కోరారు. కాజీపేట వాటర్ ట్యాంక్ ఆవరణలో శనివారం పచ్చదనం, పరిశుభ్రతపై డివిజన్ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈ రామన్న, నార్లగిరి శ్రీనివాస్, భాగ్యలత, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఖిలా వరంగల్: ఖమ్మం జాతీయ రహదారిపై లారీని బైక్ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఖిలా వరంగల్ మండలం మామునూరు గ్రామంలో ఖమ్మం వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. వెనుకనే ఉన్న బైక్ లారీని బలంగా ఢీకొట్టింది. దాంతో పున్నేలు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఎదురెదురుగా వాహనాలు ఢీ

మామునూరు: టాటా ఏస్ వాహనం.. లారీ ఎదురుగా ఢీకొట్టడంతో టాటా ఏస్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై తిమ్మాపురం క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వర్ధన్నపేట నుంచి టాటా ఏస్ వాహనం వరంగల్ వైపు వెళ్తున్న క్రమంలో ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి ఆ వాహనాన్ని ఎదురుగా ఢీకొట్టింది. దాంతో టాటా ఏస్ డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కిపోయి తీవ్ర గాయాలపాలయ్యాడని పోలీసులు తెలిపారు.

బైక్ – ఆటో ఢీ

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులో శనివారం రాత్రి బైక్ – ఆటో ఢీ కొట్టిన సంఘటనలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో అటువైపు కారులో వెళ్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు గమనించి క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి ఆస్పత్రికి తరలించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రామన్నపేట: కాంగ్రెస్ నేత నవీన్‌రాజ్ తనను మోసం చేశాడని వారం క్రితం సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించిన దేశాయిపేటకు చెందిన అంజనీదేవిపై ఇంతేజార్‌గంజ్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అంజనీదేవి సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం అక్కడే కాశిబుగ్గకు చెందిన ఎలిశాకు అంజనీదేవికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో తనను కులం పేరుతో అంజనీదేవి దూషించినట్లు ఎలిశా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ వివరించారు.

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి



మాట్లాడుతున్న పీఠాధిపతి బాబురావు

హన్మకొండ కల్చరల్: పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని, పరిశోధనాంశాలను లోతుగా అధ్యయనం చేసి వాటి మూలాలను వెలికితీయాలని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు సూచించారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో శనివారం కార్యక్రమంలో ఎంఫిల్, పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులకు పరిశోధన సిద్ధాంతాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాబురావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు.. పరిశోధక విద్యార్థులకు సూచనలు, సలహాలు, పరిశోధక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరెపల్లి రవికుమార్, డాక్టర్ బాసాని సురేష్, అబ్బు గోపాల్‌రెడ్డి, రాజమండ్రి కళాపీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, సిబ్బంది పరావస్తు విజయలక్ష్మి, సునంద, ఆంజనేయులు, అశోక్, కస్తూరిబాయి, నోముల రాజు, వెంకటేశ్వర్లు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, స్వీపర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన బానోతు బాలుకు పరిశోధక విద్యార్థులు నిత్యావసర సరుకులు అందజేశారు.

స్కౌట్ అండ్ గైడ్స్‌లో కేవీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కాజీపేట అర్బన్: కరీంనగర్ కేవీలో జరిగిన హైదరాబాద్ రీజియన్ స్థాయి స్కౌట్ అండ్ గైడ్స్ కార్యక్రమంలో కడిపికొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రైమరీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. స్కౌట్ అండ్ గైడ్స్ చతుర్థ చరణ్ హీరన్ ఫాంక్ పరీక్ష శిబిరంలో కేవీ ప్రైమరీ నుంచి 11 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని కేవీ వరంగల్ ప్రిన్సిపాల్ సుభాషిణి శనివారం తెలిపారు. ఈమేరకు విద్యార్థులు ఆరాధ్య రాగి, హస్విక, రితేష్, బండి మన్విత్ పటేల్, పర్ణిక, హంసవేణి, అన్విత, సాయి సమన్వి, తేజస్వరూప్, ధ్రువ, మనోవిరామ్‌ను అభినందించారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ

దేశాయిపేట: దేశాయిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 400 మంది విద్యార్థులకు రూ.20 వేల విలువగల స్టీల్ ప్లేట్లను సీడబ్ల్యూసీ చైర్మన్ అనుమండ్ల అనిల్‌చందర్ రావు చేతుల మీదుగా బహూకరించినట్లు సేవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అందించినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి అయిత ఉషాభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా చందర్ రావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం, అలాగే ప్లేట్లను బహూకరించిన సంస్థ సభ్యులను అభినందించారు. సంస్థ వ్యవస్థాపకుడు జూపాక రత్నప్రణయ్, సంస్థ అధ్యక్షుడు



ప్లేట్లను అందజేస్తున్న అనిల్‌చందర్ రావు

కె.బాబురాజ్, జి.ఆనందం, ఆర్.లక్ష్మీజగన్, డి.సందీప్, నిఖిల్, నయీం, పవన్‌కుమార్, భరత్, సిద్ధూ, పి.సురేందర్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చక్రపాణి, సమ్మయ్య, నిశాంత్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సఖి సేవలపై విద్యార్థినులకు అవగాహన

నయీంనగర్: బాధిత మహిళలు, బాలికలకు ఐదు రకాల సేవలు, కౌన్సెలింగ్ సహాయం, వైద్య, పోలీస్, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ సేవలందిస్తోందని లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత తెలిపారు. లష్కర్‌సింగారం శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు సఖి సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేస్‌వర్కర్ హరిత మాట్లాడుతూ పనిచేసే చోట లైంగిక వేధింపులు, గృహ హింస, అత్యాచార బాధితుల రక్షణ కోసం సఖి సెంటర్ 24 గంటలు



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకురాలు

పనిచేస్తుందని తెలిపారు. ఆపద సమయంలో బాధితులు 181, 0870 2452112 నంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వర్గీకరణ ఉద్యమంలో మంద కృష్ణమాదిగ పాత్ర కీలకం

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పాత్ర అత్యంత కీలకమైందని ఆయా సంఘాల నాయకులు కొనియాడారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన క్రమంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి ఆయా సంఘాల నాయకులు శనివారం పంచామృతాభిషేకం చేశారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏల్పుల ధర్మరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, తెలంగాణ మాదిగ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మున్నంగి రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి మాదిగ ఉద్యోగస్తుల సమాఖ్య (ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజుమాదిగ మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాటం చేస్తూ విజయం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న కాపు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకారపు మురళి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, నాయకులు పల్లె ఉదయ్ మాదిగ, మునిగాల రవి మాదిగ, రమేష్ మాదిగ, కిరణ్ మాదిగ, మంద వర్ధన్ మాదిగ, ప్రభాకర్ మాదిగ, కె.రవీందర్ మాదిగ, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: సీతారామచంద్ర స్వామి జన్మనక్షత్రం పునర్వసు సందర్భంగా ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, చైర్మన్ చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బైరి రాజుగౌడ్, వస్కుల ఉమ, జ్ఞానేశ్వరి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, సాయి శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు శ్రావణమాసం సందర్భంగా పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు.

వెంటనే వ్యవసాయ సర్వీస్‌ల మంజూరు

హన్మకొండ: రైతులకు వెంటనే వ్యవసాయ సర్వీస్‌లు మంజూరు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మధుసూదన్ రావు తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తూనే విద్యుత్ సర్వీస్ మంజూరులో కాలయాపన లేకుండా చూస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022, డిసెంబర్ 1 నుంచి 2023, జులై 31 వరకు 1097 సర్వీస్‌లు, 2023, డిసెంబర్ 1 నుంచి 2024, జులై 31 వరకు 1209 సర్వీస్‌లు మంజూరు చేసినట్లు వివరించారు. సర్వీసుల మంజూరును ఆన్‌లైన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ – స్టోర్స్ విధానం ద్వారా కావాల్సిన మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకోవచ్చని తెలిపారు.

మార్కెటింగ్ అధికారులకు శుభాకాంక్షలు

వరంగల్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ ఉప్పుల శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ అనురాధను వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలవర్గ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, చాంబర్ ప్రధాన కార్యదర్శి వేదప్రకాష్, ఎస్‌రెడ్డి లింగారెడ్డి, చింతలపల్లి వీరారావు, కంచె సంపత్, సాగర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైల్వే సీనియర్ డీఎంఈకి సన్మానం

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్ సీనియర్ డీఎంఈగా బాధ్యతలు స్వీకరించిన వెంకటకుమార్‌ను కాజీపేట రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సికింద్రాబాద్ జోనల్ సహాయ కార్యదర్శి కొమ్మాలు ఆధ్వర్యంలో పలు బ్రాంచీలకు చెందిన నాయకులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో కాజీపేట, తరాలపల్లి, జమ్మికుంట పెన్షనర్స్ సంఘం నాయకులు కేవీ.రావు, మూల ఐలయ్య, దాసరి రాజేశ్వర్‌రావు, రవి పాల్గొన్నారు.

గీతన్నల యాత్రను విజయవంతం చేయాలి

కాజీపేట: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అమరుల యాదిలో అనే పేరుతో కల్లుగీత కార్మిక సంఘం జిల్లాలో చేపట్టిన గీతన్నల చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ కోరారు. కాజీపేట మండల కేంద్రంలో ఆయన శనివారం మాట్లాడుతూ అమరుల త్యాగాలను నేటి సమాజానికి వివరిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, మోడెం రాజేందర్, బుర్ర రాజన్ బాబు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వాజేడు: ఉద్యోగం రాలేదని మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వరంగల్‌లోని రామన్నపేటకు చెందిన సాయికృష్ణ బీటెక్ పూర్తి చేసి ఐదేళ్లవుతోంది. ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురై వాజేడు, వెంకటాపురం(కె) గ్రామాల మధ్య ఉన్న బొగ్గుల వాగు వద్దకు చేరుకుని మిత్రుడికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి గడ్డి మందు తాగాడు. ఈ విషయాన్ని ఎస్సై హరీశ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి సాయికృష్ణ ఉన్న స్థలాన్ని ట్రేస్ చేసి అంబులెన్స్‌లో ఏటూరునాగారం ఏరియా వైద్యశాలకు అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు.

మార్కెట్‌లో ఉచిత వైద్యశిబిరం

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో విధులు నిర్వహిస్తున్న హమాలీలకు శనివారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల తెలిపారు. తరచుగా జ్వరాల బారిన పడుతున్నామని ఇటీవల జరిగిన సమావేశంలో హమాలీలు చెప్పడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రేడ్ -2 కార్యదర్శి రాము, సూపర్‌వైజర్లు మురళి, శ్రీనునాయక్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

